



కామాక్షమ్మ పోరు భరించలేక సుబ్రహ్మణ్యం ఓ అట్టముక్క తెప్పించి దానిపై ముద్దొచ్చేటట్లు తన చిత్రకళా విన్యాసమంతా ఉపయోగించి 'TO LET' అని వ్రాసి చూపించాడు. కూతురు సుందరికి ఆ బోర్డు నచ్చిందికాని కామాక్షమ్మ అభ్యంతరం పెట్టింది. "ఇల్లు కావలసిన వాళ్ళంతాకూడా ఇంగ్లీషు చదువుకున్న వాళ్ళే అయివుండరు. కాబట్టి తెలుగులో వ్రాయండి."

"అదికాదే ఇల్లు అద్దెకివ్వదలిస్తే ఇలాగే వ్రాయాలి. అందరూ ఇలాగే వ్రాస్తారు. వెళ్ళిచూడు. రెండుమూడిళ్లు."

"వంటా, పూజా మానేసి ఇళ్ల పట్టుకు తిరగడమేనా నా పని. అయ్యో రాతా. అసలే వూళ్ళో ఆ 'అంగ్రేజీ హటావో' గాళ్ళెవరో చార్మినార్‌నుండి ఊరేగింపు లేవదీస్తున్నారట. మీ బోర్డు చూచి ఆ గేటుమీద కాస్తా, మన ముఖాన మరి కాస్తా తారు పూసిపోతారు లెండి" రుసరుసలాడుతూ వెళ్ళిపోయింది.

సుబ్రహ్మణ్యం గత్యంతరం లేక మరో అట్టముక్క తెప్పించి దానిపై ముద్దొచ్చేటట్లు తన చిత్రకళా విన్యాసమంతా ఉపయోగించి "ఇక్కడ ఇల్లు అద్దెకివ్వబడును" అని వ్రాసి, కామా

తమ్మకు చూపించాడు మళ్లీ. మళ్లీ అభ్యంతరం పెట్టింది.

"'ఇక్కడ' అనేమాట యిందులో దండగ. ఇక్కడ కాకపోతే వల్లకాడులోనా ఇచ్చేది. మనింటికి బోర్డు వేశామంటే మనిల్లేనని అర్థం. కాబట్టి ఆ మాట కొట్టివేయండి."

"చస్తే కొట్టివేయను. రాయడం తుడపడం, తుడపడం రాయడం ఇదేనా నా పని. ఇప్పుడు 'ఇక్కడ' అన్నమాట తీసేయమన్నావు. కాసేపటికి 'ఇవ్వబడును' ఎందుకు, వాక్యం పొడుగవుతున్నది. 'ఇల్లు అద్దెకు' అని ఉంచండి చాలు అంటావు. ఆ తర్వాత మళ్ళీ వచ్చి 'అద్దెకు' అన్నమాట ఎందుకు? అద్దెకు కాక మనం ఉండటానికే అయితే అసలు బోర్డెందుకు. అదీ కొట్టెయ్యండి అంటావు. చివరకు 'ఇల్లు' మిగులుతుంది.

"ఎదురుగా దయ్యంలాగా ఇల్లు కన్పడుతుంటే, దీని పేరు 'ఇల్లు' అని వేరే బోర్డెందుకు? పీకి పారెయ్యమంటావు. చివరకు నల్లని బోర్డు మిగులుతుంది. వెర్రిముఖాలు వేసుకొని నువ్వూ, నేనూ నోట్లో వేలేసుకుకూర్చుందాము."

కామాక్షమ్మ నివ్వెరపోయింది. "అయ్యో రామా! అంత కోపమయితే ఎలా? నోట్లో వేలు కాకపోతే లడ్డుండ వేసుకోండి. నేనేం చేసిపెట్టనన్నానా? మరి ఇంట్లో తోడులేదుకదా అని మిమ్మల్ని బతిమలాడినందుకు అడ్డమైన ఆక్షేపణలన్నీ చెప్పి. అనరాని మాటలన్నీ అంటున్నారు. పోనీ అలాగే అద్దెకివ్వండి. నాదేం పోయింది" అని విసుక్కుంటూ లోపలికి పోయింది.

సుబ్రహ్మణ్యం కళ్లజోడు సవరించుకుని ఆలోచనలో పడ్డాడు. తాను అనరాని మాటలన్నీ అన్నాడా? తనకుమాత్రం డబ్బుంటే చేదా? అసలు బోర్డు వ్రాయడానికే ఇంత దెబ్బలాటయితే రేపు ఆ వచ్చేవాళ్ళతో గొడవపడదని నమ్మకమేమిటి ఈమె? గట్టిగా నిట్టూర్చి 'ఇక్కడ' అన్న మాటమాత్రం కొట్టేసి 'చస్తే కొట్టేయను' అన్న తనమాటను ఉపసంహరించుకున్నాడు.

సుందరి చెప్పిందె: "నాన్నా ఊరికే బోర్డేసి లాభంలేదు. అందులోనూ ఈ మధ్య అటు విద్యానగర్నుంచి, యిటు నింబోలియా రోడ్ద్వారా నూటికి యాభై ఇళ్లు ఖాళీ అయినాయి. అందుకని లోకల్ పేపర్లో అడ్వర్టైజ్ చేయండి. అలాగే బ్రోకరుంటాడు. అతనికికూడా చెప్పివుంచండి. ప్రయోజనం బాగా వుంటుంది."

పనిలో పనని కూతురు మాటనుకూడా ఆరోజే అమలుపెట్టాడు సుబ్రహ్మణ్యం.

మర్నాడు సెకండ్ సాటర్డే. ఆ తర్వాత ఆదివారం. అందుకని తన ప్రకటనలూ, బోర్డులూ ఏమైనా ఫలించాయేమో చూద్దామని సుబ్రహ్మణ్యం ఉదయమే నిద్రలేచి శంకరమఠానికి వెళ్ళి ఓ నమ

స్కారం పనేసి జిద్దిగా వచ్చి మఠం వేసుకొని వాకిట్లో కూర్చున్నాడు.

ఇంతలోనే "మే ఐ కమిన్ సార్" అన్న కేక.

"రండి—రండి" హుషారుగా ఆహ్వానించాడు మణ్యం.

లోపలికి వచ్చాడొక పెద్దమనిషి. చేతిలో చిన్న ఎలుగుబంటంత కుక్క!!

"మీ పేరు"

"అన్వార్ హుస్సేన్". నములుతున్న కిళ్లీతంబ తుబుక్కున ఉమ్మేశాడు.

ఊపిరి బిగబట్టి కూర్చున్నాడు మణ్యం.

"సుబ్బర్ మన్యం ఆప్ హై సాబ్."

"ఆ నేనే. ఆ మాన్యాన్ని—మీరు."

"నేను ఎ. జి. ఆఫీసులో పని చేస్తుండాను. మకాన్ కిరాయ్‌కి ఇచ్చేది ఇదేనా? క్రానికల్‌లో చూచినాన్" మళ్ళీ తుబుక్కున ఉమ్మేశాడు.

హతాశుడై నాడు మన్యం!!

"మీరు శాకాహారులా, మాంసాహారులా?"

"మాంసం తింటాం—ఏం కూడదా?"

"అబ్బే అబ్బే! నిక్షేపంగా తినవచ్చు. కానీ మేము శాకాహారులకు మాత్రమే ఇవ్వాలనుకుంటున్నాము."

"ఏమండీ. మీరు మన్నిస్తే చద్వుకున్నట్లుంది. ఆహారం పేర కులాలు కట్టార్. యహీ సంప్రదాయికతా హై మానే—కమ్యూనల్."

"క్షమించండి హుస్సేన్‌గారూ. నేను కమ్యూనలిష్టును కాను. హిందూ-ముస్లిం భాయీభాయీ నా నినాదం. గాంధీయం నా ఆదర్శం. కానీ మేము ఇల్లు మాంసాహారులకు ఇవ్వం.

"అచ్ఛా సాబ్. మేము మాంసం మానేస్తాం. బిర్యానీ హోటల్లో తింటాం. కానీ యే కుత్తా జో హై. ఇస్‌కూ ఖిలానా (ఈ కుక్క వుందే — దీనికి మాత్రం తినిపిస్తాము)

"పిల్లి కాదు, తూటు అన్నట్లుంది. మీరైతేనేం, కుక్కయితేనేం — రెండూ ఒకటే."

"క్యా బోల్ రహే హై ఆప్" కోపంతో లేచాడు హుస్సేన్ జీ!!

"నేను. కుక్కా ఒకటేనంటావ్. ఏం మనిషివయ్యా నువ్వు" పోట్లాటకు లంకించుకున్నాడు.

మణ్యానికి తొలి బోణీతోనే తల తిరిగింది. హుస్సేన్‌జీని ఎలా వదిలించుకోవాలో తెలియలేదు. ఓ అయిదు నిమిషాలు పోట్లాడి పోట్లాడి మన్యం జవాబివ్వక పోయేసరికి విసుగెత్తి తానే వెళ్ళిపోయాడు.

"ఏమేయ్ కాఫీ" గావుకేక పెట్టాడు మణ్యం.

కామాక్షమ్మ కాఫీ తెచ్చిచ్చింది. గడగడ మంచినీళ్లలా తాగి కప్పు కిందబెట్టి గట్టిగా నిట్టూర్చేలోగానే "ఇదేనా అండీ సుబ్రహ్మణ్యంగారిల్లు" అని బయటినుండి కేక!!

"రండి—రండి. ఇదే—ఇదే. నేనే ఆ మణ్యాన్ని". 'చిత్తం'—ఓ వయస్సు మళ్ళిన వ్యక్తి వచ్చాడు. "నా పేరు ప్రసాదరావు. పూర్తిపేరు వీరవేంకట సత్యసుబ్రహ్మణ్య ప్రసాదరావు. వీరయ్య మా తాతగారు. వేంకట అంటే వెంక టేశ్వరస్వామివారి పేరు. బిడ్డవి పుట్టి నీ తూంటే మా అమ్మగారు మొక్కు కున్నారు. సత్య వుంది చూడండి. ఆ సత్య—హ్హహ్హ—సత్య అంటే అన్న వరం సత్యన్నారాయణస్వామివారి పేరు అనుకుంటాం కానీ—సాక్షాత్తూ కలియుగ వైకుంఠం కదండీ అన్నవరం—ఓహో—ఏం క్షేత్రం—ఏం క్షేత్రం—"

మణ్యం బిక్కముఖం వేశాడు. క్షేత్ర పురాణమూ, స్థల మాహాత్మ్యమూ ఇంకా ముగియలేదు. అదైన తర్వాత సుబ్ర హ్మణ్య శబ్దానికి టీ కా తా త్ప ర్యా లు చెప్పాలి. ఆపైన ప్రసాదశబ్దానికి సందర్భ సహితవ్యాఖ్య వివరించాలి. ఆ తర్వాతే ఇంటి అద్దె ప్రస్తావన ఎప్పటికిదంతా ముగిసేది భగవాన్....

"ఏమేవ్ రెండు కాఫీలు"....

"ఏమిటీయన, ఉదయంనుండీ నేడు కుడితి తాగినట్లు తాగుతున్నాడు కాఫీ" కామాక్షమ్మ సణుగుడు ఇక్కడిదాకా విని పిస్తూనే వుంది....

"అయిందా....అదీ నా పేరు, ఇక నా ఉద్యోగం...."

వరప్రసాదరావు తాను యెక్కడ పుట్టిందీ, ఏ స్కూల్లో ఎన్నాళ్ల చదివిందీ, ఏయే ఆటల్లో ఎన్ని మెడల్సు సంపా దించిందీ చెపుతున్నాడు. ఏ ఆఫీసులో ఎప్పుడు చేరిందీ, ఎన్ని ప్రమోషన్లు వచ్చిందీ వివరించాడు. ఈ మోకాలిమీద మచ్చవుంది చూచారూ, నల్లని మచ్చ.... దీనికొక చరిత్ర వుంది.

నల్లమచ్చ చరిత్ర ప్రారంభమైంది.

మణ్యం మళ్లీ కాఫీ అని కేకవేద్దా మనుకొని, కామాక్షమ్మ ఈసారి అప్పడాల కర్రతో వస్తుందేమోనని మాట్లాడకుండా కూర్చున్నాడు.


నల్లమచ్చ సామాన్యమైనది కాదు.

బ్రిటీషువాళ్ళకున్నంత చరిత్ర వుంది.

రోమన్ సామ్రాజ్యపు ఉచ్ఛ పతనాల కున్నంత కథా కమామిషూ వుంది. తాను మోటర్ సైకిల్ యాక్సిడెంటులో పడటం, ఉస్మానియా హాస్పిటల్లో చేర్పించడం వగైరా అంతా దీనికి నేపథ్యంలో వుంది. అదంతా వరప్రసాదరావు నాటకీయంగా చెపుతున్నాడు.

"ఆరోజు సాయంత్రం ఆరుగంటలు. వేలసైకిళ్ళు, రిక్షాలూ ఎవరో తరుము తున్నట్లుగా, నిర్విరామంగా నయాపూల్ మీదినుండీ పరుగెత్తుతున్నాయి. కాల పురుషుని కేళీవిలాసంలో ఒక పాపినైన నేను విధిచేత తరుమబడినట్లు మోటర్ సైకిల్పై బయలుదేరాను.

"ఈ బో డి క థ కొక కవిత్వం కూడానా" అనుకున్నాడు మణ్యం.



''మోటర్ సైకిల్ శరవేగంతో పరుగెత్తుతున్నది .... ఎదురుగా మనుషులు, పక్కన మనుషులు, వెనుకగా మనుషులు, మోటర్ సైకిల్ వేగం పుంజుకున్నది.... మోటర్ సైకిల్ .... మోటర్ సైకిల్ ''

మణ్యానికి మండుకొచ్చింది. ఈ ముష్టి చరిత్ర కాక సస్పెన్సుకూడా సృష్టిస్తున్నాడితడు. మోటర్ సైకిల్ నడపడం చాతకాక, వెల్లికిలా పడి హాస్పిటల్‌లో చేరి, తానేదో జేమ్సుబాండ్ సీరియల్‌ను చెప్పినట్లు ''మోటర్ సైకిల్...మోటర్ సైకిల్'' అని ఊపిరి బిగబట్టి కథ చెపుతున్నాడు.

మణ్యానికి ఏం చేయాలో తోచలేదు. పోనీ ఏదో పెద్దవాడు, తన కష్టసుఖాలు చెప్పుకుంటున్నాడు. ఆ మాత్రం వింటే ఏం, తన సొమ్మేమన్నా పోయిందా పెటవునాడు? అని సరిపెట్టుకుందామన్నా ఈ కథ నల్లమచ్చ చరిత్రతో ఆగేటట్లు కన్పడలేదు. ఆ తర్వాత కొడుకు ఉద్యోగం. కూతురు పెళ్లి. ఆమె గర్భవతి కావడం. రోజంతా నొప్పులు పడటం. మనవడు పుట్టడం. వాడు కాలుజారి నల్లా (పంపు) వద్ద పడటం. వాణ్ణి హాస్పిటల్లో చేర్పించడం. మళ్లీ నల్లమచ్చ.

ఇలా ఈ కథ ఎప్పటికి ముగుస్తుందో ఎవడికి తెలుసు. పరమేశ్వరుడికి తప్ప!!

''బేడ్ ఛేస్ట్'' అని తెలిసికూడా గత్యంతరం లేక అనాడు. ''అయ్యా ప్రసాదరావుగారూ, మనం ఇంట్లో ప్రవేశించాక, అన్ని విషయాలూ తీరికగా మాట్లాడుకుందాము. నాకు కొంచెం బయటకు వెళ్ళవలసిన పని వుంది. దయచేసి ఇల్లు చూస్తారా.''

విధిలేక వరప్రసాదరావు తన ప్రహసనాన్ని మధ్యలోనే ఆపి ఇల్లు చూడడానికి లేచాడు. మణ్యం ఉత్సాహంతో ఇల్లు

చూపిస్తున్నాడు. "చూచారా ఇది వరండా, అదుగో అది డ్రాయింగ్ రూమ్, రండి—రండి. ఆఁ ఇది కిచన్"—ఇది చిన్న సందులాంటిది.

"భలేవారు సార్" పెద్దగా వెర్రికేక పెట్టినట్లు నవ్వాడు.

వరప్రసాదరావు — "ఇది వరండా, ఇది కిచన్, ఇది గోడ, ఇది కుర్చీ, ఇది టేబిల్, ఇది మా ఇంటి పెంపుడు పిల్లి, ఇదుగో ఇది తలుపు, ఆ పక్కది కిటికీ ఏమిటి సార్ ఇది కన్పడుతూనే వుంటే ఇది తలుపూ, ఇది కిటికీ అని చెప్పేందు కేముందీ...అసలు దీని వ్యవహారమేమిటో కధేమిటో కాకరకాయేమిటో—అదీ—అది చెప్పండి సార్.'

మణ్యానికి వరప్రసాదరావు ఏ కాకర కాయగూర్చి అడుగుతున్నాడో బోధపడ లేదు....అయినా కొన్నిమాత్రం చెప్పాడు· "చూచారూ ఈ చిన్న సందుందే దీనిని మనం పెరడనుకుందాము, ఆ ముందు మేడమెట్ల క్రిందవున్న గూడు వుందే అది గోడౌన్ అనుకోండి. ఈ కిచన్ పైనవున్న స్లాబ్ వున్నదే ఇది అటక అనుకోండి.

మన్నెం మాటలు పూర్తి కాకుండానే వరప్రసాదరావు మధ్యలో 'హ్హా హ్హా హ్హా' అని నవ్వాడు. "అనుకోండి—అనుకోండి అని అంటే అర్ధమేమిటి? దేన్ని అనుకో వాలి? లేనిదాన్నే ఉన్నట్లు అనుకోవాలి. అభావం భావమెలా అవుతుందీ? ఇదేదో రామలింగడి కథలా వుంది. రామలింగడు గోడలపై విలువు గీతలు పెట్టాడట. ఇదేమిటని రాయలవారు ప్రశ్నిస్తే "ఇవన్నీ తోరణాలనుకోండి సార్—గుర్రాలన్నీ గోడ కవతలివైపున ఉన్నాయని అనుకోండి' అన్నాడట...అలా వుందిది."

మణ్యానికి మతిపోయింది. వరప్రసాద రావు తెనాలి రామలింగడి కథలు మొదలు పెట్టాడు. ఇక కాశీమజిలీలు, అరేబియన్ నైట్సు, ఆపై సింద్‌బాదు యాత్రలూ ఇలా ఒకదానివెంట ఒకటి వస్తాయి కాబోలు. వాటికింక ముగింపెప్పుడు భగ వంతుడా అనుకున్నాడు.

వరప్రసాదరావు నవ్వి "ఇల్లు బాగుంది. ఇంతకూ అద్దె విషయం చెప్ప లేదు" అన్నాడు

"ఖచ్చితంగా తొంభై ఆరు రూపా యలు"

"ఇదేదో బూట్లకంపెనీ రేటులాగుందే పదిహేనురూపాయల తొంభై ఆరు పైన లన్నట్లు నూరు నూరని చెప్పండి సార్. శతమానం భవతి శతాయుష్.'

మణ్యం చెప్పాడు; "మేము ఇల్లు శాకాహారులకు మాత్రమే కద్దామను కుంటున్నాము."

వరప్రసాదరావుకు కోపం వచ్చింది. "వాడ్డూ యూ మీన్ బై దట్· నా ముఖం చూస్తే మాంసం తింటున్నట్లు కన్పదిందా ఏమిటయ్యా? పెద్దమనిషివి లాగున్నావు. ఏంమాటలయ్యా అవీ మంచినీళ్ళు



యువ

వచ్చి గంగకూడా హోటల్లో ముట్టుకోను."

"క్షమించండి. మీరు తింటారని కాదు. ఆహారపదార్థాల కొరతవల్ల వెజిటేరియన్ నాన్ వెజిటేరియన్ రెండూ చాలామంది ఉపయోగిస్తున్నారు. కాకుంటే నేను నా ఇంటి రూల్స్ చెపుతున్నాను."

"చాల్లేయ్యా చాదస్తుడా! రూల్సట రూల్సు బోడి రూల్సు. ఆ మాత్రం రూల్సు మాకు తెలియనట్లు. గతిలేక ఏదో కాపిటల్ ఇక్కడ పడేశారుకదా అవి ఉద్యోగరీత్యా రాక తప్పదు కాని మాకసలు ఇల్లే లేనట్లు అద్దెల మొఖమే తెలీనట్లు మాట్లాడుతా వేమయ్యా"

ఆహా! విధివిలాసం! క్షణంలో వరప్రసాదరావు ముందు మణ్యం చాదస్తుడై పోయానాడు.

"అదికాదుసార్. చెప్పవలసిన విషయం."

"ఇంక నీవు చెప్పవలసిందీ నేను వినవలసిందీ ఏమీ లేదు పోవయ్యా. మర్యాదలేని వాడివి. నన్ను శుద్ధ శ్రోత్రియుణ్ణి పట్టుకొని ఎంతలావు మాట అన్నావు అవ్వవ్వ. ఎవరైనా వింటే నవ్వుతక్కువ. అసలు మా వంశం ఎలాంటిది."

"తరణినుండి విశుద్ధతరమైన వంశంబు." పద్యం చదువుతూనే విస్ఫూర్తిమించాడు వీర వెంకట సత్య సుబ్రహ్మణ్య వరప్రసాద రావు!!

మణ్యానికి ఒంట్లో సత్తువంతా ఇప్పటికే నశించింది.

"మేఐ కమిన్ సార్" ఇంతలోనే వాకిట్లో పిలుపు.

"రండి. రండి. నిరుత్సాహంగా అన్నాడు మణ్యం లోనికి ఒకబ్బాయి వచ్చాడు. గొట్టాం పాంటు. నారో బూట్. చెవి చివర వరకూ పెంచిన చెంప జుత్తు చేతిలో ఓ సినిమా పత్రిక. వెనుక జేబులో ఓ దువ్వెనా.

"ఏం బాబూ ఎవరు కావాలి?"

"మీరేనాసార్ సుబ్రహ్మణ్యం గారు?"

"అవును. ఏం?"

సవినయంగా నమస్కరించాడు.

"రాకేశ్. ఇక్కడే సెకండ్ డిగ్రీ చదువుతున్నాను."

"మంచిది. ఏం కావాలి?"

"మీరు ఇల్లు అద్దెకిస్తున్నట్లు పత్రికల్లో వేశారుకదా. అందుకని వచ్చానుసార్."

"చూడు బాబూ. అది ఫామిలీ పోర్షన్. బాచులర్స్‌కు ఇవ్వం."

"ఏం ఎందుకివ్వరు?"

"అది మా ఇష్టం."

"అసలు ఫామిలీ అన్న శబ్దానికి మా లెక్చరరు గారు చెప్పిన డిఫినిషన్ బట్టి చూస్తే ఇప్పుడున్నవన్నీ ఫామిలీలు కావు. ఎకనమిక్స్ లో ఫామిలీ అంటే."

"చూడు బాబూ. ఎకనమిక్స్ ఫామిలీ, ఎడ్మినిస్ట్రేషన్ ఫామిలీ, డిఫినిషనూ దాని

ఫైవింగూ ఇప్పుడక్కర లేదు. ఇది స్టూడెంట్సు కివ్వం. ఎవరైనా కుటుంబీ కులకే ఇస్తాం."

"ఒక వేళ ఇల్లు ఇచ్చాక వాళ్ళు కుటుంబీకులు కాకూడదా?"

మణ్యానికి రాకేశ్ మాటలోని గూఢార్థం చప్పున బోధపడలేదు.

"ఇంతకూ దీని అద్దె నూరు రూపాయలు. ఇల్లు చూస్తావా?"

"అక్కర్లేదు. ఇల్లు చాలా బాగుంది. ఎంతో చల్లగా, ఎంతో హాయిగా చూస్తేనే వొళ్ళు పులకించి పోతుంది ఒళ్లు. విస్మయం చెందుతాను నేను. ఆ సౌందర్యమూ, ఆ పొందికా, ఆ రంగూ, ఆ హంగూ."

"ఏమయ్యా రాకేశూ ఏ రంగు గూర్చి మాట్లాడు తున్నావు. నేను వేయించిన రెల్ల గూర్చేనా?"

"నాన్నా ఇటురండి" లోపలినుండి సుందరి పిలుపు.

"ఇప్పుడే వస్తాను బాబూ" లోనికి వెళ్ళాడు సుబ్రహ్మణ్యం. సుందరి చెప్పింది "నాన్నా! ఆ పిల్లాడున్నాడే, వట్టి రౌడీ గుంటడు నాన్నా. ఎప్పుడూ ఆడపిల్లలను ఏడిపిస్తూ వుంటాడు రోడ్లమీద. పోలీసు రిపోర్టు చేస్తే ఫలితంలేకపోగా, వాడి బాధ అలాగే వుండగా పోలీసులబాధ తగులు కుంటుందని ఊరుకున్నాము మేము."

"నా కెప్పుడూ చెప్పనేలేదేమమ్మా."

"ఇదేం మహా విషయమని చెప్ప దానికి రోజూ ఇలాంటి వాళ్లు డజన్లకొద్దీ జట్లు కట్టుకొని తిరుగుతుంటారు, రోడ్ల మీద."

మణ్యానికి బాగా కోపంవచ్చింది "రౌడీ వెధవ. వాళ్ళ ప్రిన్స్‌పాల్‌కు రిపోర్టు చేస్తాను."

"అంతా వట్టిది. అతను స్టూడెంటే కాదు. పైగా ఏమని రిపోర్టు చేస్తారు? మీరు "టూ లెట్" బోర్డు పెట్టారు. అతడు వచ్చాడు అడగటానికి. తప్పేముంది" "లా" దృష్టిలో మణ్యానికి పిచ్చెక్కినట్లయింది.

వాకిట్లోకి వచ్చాడు. రాకేశ్ అలాగే కూర్చొని వున్నాడు.

"చూడబ్బాయ్. ఈ ఇల్లు అద్దెకివ్వడం జరిగింది. నువ్వికవెళ్ళవచ్చు."


"ఎవరికిచ్చారు సార్."

"ఎవడో వల్లకాట్లో రామనాథయ్యకు. ఎవరైతే నీకేమి? మావాళ్లు ఇంట్లో ఇప్పుడే ఆ విషయం చెప్పారు."

"మీరు అబద్ధం ఆడుతున్నారు. ఉదయం ఏడుగంటలకు నేను క్రానికల్‌లో చూచాను. ఎవిమిదికూడా కాలేదు వచ్చాను—అప్పుడే ఇచ్చారా."

"ఆఁ ఇచ్చేశామోయ్. ఈ మధ్యలో ఓ గంటకాలం నడిచింది. గంటంటే అరవై నిమిషాలు. మూడువేల ఆరువందల సెకండ్లు."

"ఏడువేల రెండువందల అర్ధ సెకండ్లు. పధ్నాలుగువేల నాలుగువందల




పావుసెకండ్లు...ఏమిసార్ నాకు లెక్కలు చెపుతారు?'' మణ్యం కోపాన్ని హాలాహలంలా గొంతులోనే నిలుపుకున్నాడు.

విధిలేక, ''నేను స్కూలుమాస్టర్ని కాదు. లెక్కలూ, స్టాటిస్టిక్సూ చెప్ప డానికి. ఇల్లు వేరేవాళ్ళకు ఇచ్చేశాం. నీవిక వెళ్లు.''

''ఏం. ఎందుకు వెళ్లాలి? వాకిట్లో ఇంకా 'ఇల్లు అద్దెకివ్వబడును'నే బోర్డు అలాగే నిక్షేపంలా వేళ్లాడుతూ వుంది. కాదంటే ఇరుగూ పొరుగువారిని పిలుస్తాను. ఎవరైనా సరే, నావైపే సాక్ష్యం చెపుతారు.''

మణ్యానికి పరిస్థితి విషమిస్తున్నట్లు తోచింది. నిస్సహాయుడై పోయాడు అంత పెద్ద మనిషికూడా.

''బాబూ—నీకు పుణ్యముంటుంది—నేరకపోయి బోర్డు ఇంకా తీయలేదు—అల్లరిచేయకుండా వెళ్లు. ఇదుగో ఇప్పుడే తీసేస్తున్నా....'' వెళ్ళి బోర్డు తీసేశాడు.

రాకేశ్ లేచి నిలబడ్డాడు. ''మీరు అబద్ధం ఆడుతున్నారని నాకు బాగా తెలుసు సార్. అయినాసరే యెందుకు లెమ్మని వదిలిపెడుతున్నాను ఈసారికి. మరోసారి నావంటివాళ్ళతో పరాచికాలాడకండి. ప్రమాదం'' బెదిరించి మరీ వెళ్లిపోయాడు రాకేశ్.

మణ్యం దిక్కుముఖం వేసుకుని కూర్చున్నాడు.

''మే ఐ కమిన్ సార్.''

''నో సార్. ఇల్లు అద్దెకిచ్చేశాం. బోర్డుకూడా లేదు.''

మణ్యం జవాబు వినకుండానే గేటవతలి వాళ్ళు లోపలికి వచ్చారు.

"ఆదేలు దాసోహమ్. అయ్యా! నా పేరు రామానుజస్వామి. ఇక్కడ గృహవసతి వున్నట్లు విని వచ్చాను. అభ్యంతరం లేకపోతే అది చూస్తాను"

సుబ్రహ్మణ్యం రామానుజస్వామిని పరిశీలించి చూచాడు.

మనిషి చాలా సాత్వికునిలా కన్పడ్డాడు.

చక్కగా ముద్దొచ్చేట్లు తీర్చిదిద్దిన విష్ణుపాదాలు.

మెళ్ళో తులసిపేరులూ, చేతులో ఓ గొడుగూ.

మోడరన్‌గా క్రూకట్ అని పిలిచే తీరులో వున్న జుత్తూ—

"కూర్చోండి."

రామానుజస్వామి ఆనందంగా కూర్చున్నాడు.

"ఆ రామానుజస్వామిగారూ. ఉన్న విషయాలు నిక్కచ్చిగా ముందే చెప్పేస్తున్నాను. తర్వాత దెబ్బలాడి లాభం లేదు. బాత్‌రూమ్, లావేటరీ కామన్."

"అస్తు—అస్తు."

"అస్తు కాదు వస్తు. వినండి. నాకసలే బ్లడ్ ప్రషర్. రాత్రిపూట బిగ్గరగా మాట్లాడటానికి వీలులేదు. తొమ్మిది గంటలకల్లా గేట్లు బంద్ చేస్తాము. అందుకని రెండో ఆటకు వెళ్ళేందుకు వీలులేదు మాకు మసాలావాసన గిట్టదు అందుకని మదమాంసాదులు వండేందుకు వీలులేదు. మా అమ్మాయికి కుక్కలంటే భయం. అందుకని కుక్కలను పెంచేందుకు వీలు లేదు.."

రామానుజస్వామి నవ్వి "స్వాములవారెందుకో అగ్రహోదగ్రులై ప్రవర్తిస్తున్నారు నాయెడ — దాసుణ్ణి — దయ వుంచండి. తమకు కూడనివన్నీ ఓ లిస్టు వ్రాసి ఇవ్వండి మా వాళ్ళను ఆ పనులేవీ చెయ్యవద్దని చెపుతాను" అన్నాడు

"ఇంకో మాట ... పంచపాళీ వుంది చూడు. అది బంగాళా పెంకులతో కట్టాము. ఎండాకాలంలో ఎండ, వర్షాకాలంలో వర్షం."

"చిత్తం. సూర్యచంద్రులూ, నక్షత్రాలూ, గాలీ, నీరూ, వేడీ, చలవా సహజసంపదలన్నీ పుష్కలంగా ఇంట్లోనే వుంటాయి. దాసుణ్ణి! అంతకన్నా మా వాళ్ళకు కావలసిందేముంది!"

సుబ్రహ్మణ్యానికి రామానుజస్వామిపై మితిలేని దయ కలిగింది. అనవసరంగా వెనుకటి వాళ్ళమీది కోపమంతా ఈ గంగి గోవుపై చూపిస్తున్నాడు క్రూరంగా తన ప్రవర్తనకు తానే నొచ్చుకున్నాడు.

"రామానుజ స్వామిగారూ. మీకు ఇల్లు ఇస్తాను."

"దాసుణ్ణి! ఇల్లు నాకుకాదు మా వాళ్ళకు"

"అదేలెండి మీ వాళ్ళకే ఇల్లు ఇస్తాను. బాడుగ విషయంలో కూడా పెద్ద పట్టింపులుండవు. మీ వాళ్ళను వచ్చి చేరమనండి."

"మీ అనుగ్రహానికి కృతజ్ఞుణ్ణి.

ఇప్పుడే వెళ్ళి మావాళ్ళ కీవిషయం చెప్తాను" చేతులు నులుముకుంటూ లేవబోయాడు.

సుబ్రహ్మణ్యానికి సంతోషం కలిగింది. మొత్తానికి, మొదట్లో బాధనిపించినా ఎల్లాగైతేనేం మంచి మనుషులే దొరికారని సంతోషించాడు "ఏయ్ కామాక్షీ! ఓ రెండు వేడి కాఫీలు పట్రా" సంతోషంగా పెళ్ళానికీవిషయం చెప్పాలనుకున్నాడు.

రామానుజులవారు ముసిముసి నవ్వులు నవ్వారు.

"ఏం అలా నవ్వుతున్నారు స్వామీ."

జవాబు చెప్పలేదు స్వామి.

'ఫరవాలేదు సిగ్గుపడకండి, చెప్పండి.'

"ఏమీలేదు. ఇల్లాలిని మా ఇళ్ళల్లో "ఔనే" అని పిలవడం సంప్రదాయం 'ఔనె పత్పుత్రి, జనయిత్రి, ఔనెసాధ్వి' అంటాడు చూడండి శ్రీనాధ మహాకవీంద్రులు. మీరలా పేరుతో పిలిస్తే నాకేదో అధునికత్వం కొట్టవచ్చినట్లు కన్పడి చమత్కారంగా వుంది సుమండీ."

"గడుసువాడవేనయ్యా పంతులూ, మృదువుగా మాట్లాడుతూనే బలమైన దెబ్బ కొట్టావు. ఆఁ. ఆఁ. కాఫీ తాగండి. మాకెన్నాళ్ళకు మంచి తోడు దొరికింది. కూర్చోండి"

"చిత్తం. నాకూ భవదీయ దర్శనంతో శ్రీరంగేశ్వర సందర్శనోత్సాహం సిద్ధించింది. నేనుండకపోతేనేమి తరచు తమదర్శనం చేసుకుంటూనే వుంటాను."

"అంటే. ఇల్లు మీకుకాదూ?"

"దాసుణ్ణి! నాకుకాదు. నేను పంజగుట్టలో వుంటున్నాను. ఇల్లు మా వాళ్ళకి."

"అంటే మీ ఆడవాళ్ళకా" అనుమానంగా అడిగాడు.

"కాదు మాపిల్లవాళ్ళకి."

"ఓహో! మీ కొడుకూ కోడలు కూనా?"

"చిత్తం, కాదుకాదు మా వ్యాయామశాల సభ్యులకు. నేను దానికి ప్రెసిడెంటును. మావాళ్లు హనుమానులవారిని ఉపాసిస్తూ వుంటారు నేను చూడండి వ్యాయామంలేక ఎలా బలహీనుణ్ణిగా వున్నానో. అందుకనే "బలముపాస్వ" అన్న వివేకానందుల వారిసూక్తిపై విశ్వాసంతో నేనే ఈ వ్యాయామ శాలను ప్రోత్సహిస్తూ ఈ కార్యభారం నా భుజస్కంధాలపై వేసుకున్నాను. మా వ్యాయామ శాలపేరు "వీరాంజనేయ వ్యాయామశాల" దీనికి సెక్రెటరీ భజరంగబలి. గట్టిగా గుద్దేసరికి మొన్న దున్నపోతొకటి నేలకూలింది. అంత బలవంతుడు. అభినవ భీముడు. అతడు శ్రద్ధతో ఎప్పుడన్నా నాకు పాదాభివందనం చేస్తే ఆకాళ్ళు ఓ వారం రోజుల వరకూ స్వాధీనంలోకి రావు."

సుబ్రహ్మణ్యం గడగడ గడగడ గువ్వపిట్టలా వణుకుతున్నాడు.

"మిగిలినవాళ్ళు కూడా తక్కువ

వాళ్ళెంకాదు. అచ్చంగా హనుమానుల వారి అపరావతారాలు చూచి రమ్మంటే కాల్చి వస్తారు. నన్ను సాక్షాత్తూ శ్రీరాముని వలెనే భావిస్తారు మహా భక్తులు'' రామానుజ స్వామి శిష్య బృందపు భక్తిని తలచుకొని పులకాంకితుడైనాడు.

''ఇలాంటివాళ్ళు ముప్పై మంది రోజూ మనింట్లో సాధనలు చేస్తారు.''

''బ్లడ్ ప్రెషర్. బ్లడ్ ప్రెషర్. బ్లడ్.'' అంటూ సుబ్రహ్మణ్యం గోడకు సొమ్మసిల్లాడు లోపలినుంచి ఆదుర్దాగా కామాక్షమ్మా, సుందరీ వచ్చి సుబ్రహ్మణ్యాన్ని మోసుకుపోయి మంచంపైన చేర్చారు.

హంగామా చూచి భయపడి రామానుజ స్వాములవారు గొడుగు చంకలో పెట్టుకొని జారుకున్నాడు.

సుబ్రహ్మణ్యం మరి మంచం మీది నుండి లేచి కూర్చోలేక పోయాడు.

బయట ఎవరో వస్తూనే వున్నారు. సుందరి ఆదేపనిగా కూర్చొని ఇల్లు ఇచ్చేశామని చెపుతూనే వుంది. అలా సాయంత్రంవరకూ గడిచింది

సుబ్రహ్మణ్యం అప్పటికి కొంచెం తేరుకున్నాడు. రక్తపుపోటు కొంత తగ్గుముఖం పట్టింది. కాని గుండెదడ పూర్తిగా తగ్గలేదు. కళ్ళయెదుట దున్నపోతును గుద్దుకుచంపిన భజరంగభళి కనిపిస్తూనేవున్నా డింకా....

''లోపలికి రానా బాబూ'' బయట నుండి కేక....

''ఖాళీ లేదు. ఇల్లు ఇచ్చేశాం.''

''సంతోషం—సంతోషం'' లోపలికి వచ్చాడు యాదయ్య.

''ఓహో! యాదయ్యా—నువ్వా—రా. రా.''

''ఎందరొచ్చినారు బాబూ కిరాయోళ్లు.''

''ఎందరని చెప్పను యాదయ్యా. ఓ వందమందొచ్చారు నా ప్రాణం తీసేందుకు.''

''ఆహాఁ. అందరూ వచ్చినారేంటి—వాళ్ళందరినీ నేనే పంపినాను సామీ.''

సుబ్రహ్మణ్యం అనుమానంగా చూచాడు. వచ్చినవాళ్లు పేపరు చూచి వచ్చామంటారు. ఈ బ్రోకరేమో అందరినీ తానే పంపినట్లు చెపుతాడేమిటి....

''చిత్తం. నేనే పంపినానండీ ...వంద మందని అంటిరి కదా. మనిషికి రూపాయి చొప్పున వందరూపాయ లివ్వండి.''

''ఎవ్వరూ ఇంట్లో దిగందే ...''

''అదేంటి సామీ, ఇందాక ఖాళీలేదు ఇచ్చేసినామంటిరి .... పోనీలెండి, దిగినా దిగకున్నా పైసల్లో తేడాలేదు. తలకు రూపాయి—అంతే రేటు.''

సుబ్రహ్మణ్యానికి దుఃఖం వచ్చింది. బ్రోకరు మంచి బలవంతుడు. అతని చేతికింద ఓ పదిమంది భజరంగభళులున్నారు. నోరెత్తకుండా డబ్బులు సమర్పించుకొని ఇదే వెయ్యనుకో, లక్షనుకో, ఇవి చేతులు కావనుకో. యాదయ్యా—బుద్ధితక్కువై వందమంది వచ్చారన్నాను.

ఈ డబ్బులు తీసుకొని నన్ను ఋణ విముక్తుణ్ణి చెయ్యి. ఇంక యెవ్వర్నీ పంపకు.''

యాదయ్యకు కోపం వచ్చింది. తక్కువడబ్బు లిచ్చినందుకు. అయినా సుబ్రహ్మణ్యం మీద కల ప్రేమకు చిహ్నంగా అన్నట్లు ఏమీ మాట్లాడకుండా ఏదో నసుగుతూ వెళ్లిపోయాడు.

భోంచేసి అంతా పడుకున్నారు.

కామాక్షమ్మ చెప్పింది: ''ఏమండీ, ఇల్లు ఎవరికీ అద్దెకివ్వవద్దు. అంతగా వుంటే నాకూ, సుందరికీ ఈయేడు బట్టలు కొనడం మానెయ్యండి. ఖర్చు తగ్గించుకుంటాము''

''పిచ్చిదానా—డబ్బుకోసం కాదే—ఏదో మనకు తోడుగా వుంటారని కాని''

సుందరి చీకట్లోకి చూచి కెవ్వున కేక వేసింది.

సుబ్రహ్మణ్యం లేచి కిటికీగుండా చూచాడు....ఎవరో చీకట్లో కదులుతున్నట్లనిపించింది చెట్టుపిడన. ఎక్కడలేని వీరావేశంతోనూ, వెనుకా ముందూ చూడకుండా వెళ్ళి వాటేసుకున్నాడు దొంగని.

''దొంగ–దొంగ–దొంగ'' కామాక్షమ్మ ఏడుస్తూ కేకలు పెడుతున్నది. నలుగురూ పోగైనారు....

''దొంగ వెధవ. అర్ధరాత్రయినా కాకుండా వచ్చాడు....చూడండి. ఎలా చూస్తున్నాడో—వాడు వాడి గుడ్లూ ... దూరంగా రండి—ఏ కత్తుందంటాయో—పోలీసులను పిలవండి.'' ఇలా తలొక మాటా అంటున్నారు ''వాగకండి'' పెద్దగా కేక పెట్టాడు దొంగ,

''నేనేం దొంగను కాను. మీలాంటి వాణ్ణే ఇల్లు అద్దెకున్నదంటె కనుక్కుందామని వచ్చాను.''

''ఆహాహా — అబద్ధమాడినా గోడ పెట్టినట్లుండాలి. ఏం ఎత్తువేశాడు—తాటిచెట్టెందు కెక్కావురా అంటే దూడ మేతకన్నట్లు రాత్రిపూట కిరాయికి వచ్చాడట—కిరాయికి''

''అవునయ్యా. మా ఫ్యాక్టరీ షిఫ్ట్ రాత్రి 8 గంటలదాకా వుంటుంది. అందుకని ఇప్పుడొచ్చాను. పైగా పేపర్‌లో ఇంటర్వ్యూ గంటలు ఫలానా అని లేదు. కాబట్టి ఇప్పుడొచ్చాను. కాదు కూడదని మీరు గొడవచేస్తే పెద్దమనిషిని పట్టుకొని దొంగని గోల చేసినందుకు మీపై పరువు నష్టం దావా వేస్తాను.''

వచ్చినవాళ్ళందరూ ఒకళ్ళముఖాలొకరు చూచుకుంటూ కిక్కురుమనకుండా వెళ్లిపోయారు.

ఆ రాత్రికి రాత్రే సుబ్రహ్మణ్యం పత్రికల ఆఫీసుకు పరుగెత్తాడు. మర్నాడు ఉదయం దినపత్రికలో ఇలా ప్రకటన వుంది.

''ఇందు మూలముగా సమస్త జనులకు తెలియజేయడమేమనగా సుబ్బులు వురఫ్ సుబ్రహ్మణ్యం అనే పేరుగల నేను నా 30–5–529/11 నెంబరు కల ఇల్లును అద్దెకుకాని, లీజుకుకాని, అమ్మకమునకు గాని ఎవ్వరికీ ఇవ్వబోవడంలేదు కాబట్టి, ఈ ఉద్దేశంతో నేటి ఉదయం నుండీ నా ఇంటికి ఎవ్వరూ రావద్దని మనవి. ఈ నెపంతో ఎవరు నా ఇంటికి వచ్చినా నేను తీసుకునే సివిల్ క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురు. ఇట్లు, సంతకం సుబ్రహ్మణ్యం వ్రాలు.''